# తల్లిదండ్రులు లేని బిడ్డ

[ చిన్న కథ ]

[కథావస్తువు అపూర్వమైందికాదు. మామూలు జీవితంలో ఇట్టి ఉదంతాలు మనం ఎన్నో చూస్తూవుంటాము. చిన్నతనంలోనే తల్లిదండ్రుల్ని పోగొట్టుకుని పరుల పంచల్ని పెరిగిన బిడ్డల కష్టాలు ప్రాయకంగా దారుణాలై వుంటాయి.]

రచయిత :

## జనస్వామి కోదండరామశాస్త్రి

౧

చయిన్లవయస్సు రెండుసంవత్సరాలు పైబడ్డది. అనగా వాని వయస్సు ఇప్పుడు ఏడవ సంవత్సరమన్నమాట. అల్లరీ, కొంటెతనం, మాత్రం ఏమీ తగ్గలేదుగాని చదువులో మాత్రం బాగానే పైకి ఎక్కి వస్తోన్నాడు.

చెయిన్లనుగూర్చి మీనాక్షి ఎప్పుడూ దిగులుపడుతూండేది. ఒకొక్కప్పుడు ఆమె బుర్రలో యీవిధంగా ఆలోచనలు తిరుగుతూండేవి. "చూడబోతే వీడు చాలా కొంటెవాడు. నేనుతప్ప వీడిని 'నా' అని అభిమానించే అండలేదు యీ ప్రపంచంల్లో. ఏదైనా జాడ్యము వచ్చి నేను చనిపోయినట్లయితే వీడి గతి ఏమికానున్నదోకదా? పిల్లలు, పిల్లలని అలమటించిన తండ్రి తీరా ఒక్కగా నొక్కపిల్లవాడు పుడితే, పట్టుమని పదిసంవత్సరాలపాటైనా వాడిని చూసుకోవడానికి నోచుకోలేదు. అండలేని జీవి యీ ప్రపంచంల్లో, ఎన్నో విషమ పరిస్థితులను ఎదుర్కొనాల్సి వస్తుంది. ఎన్నో నిందలను, ఎంతో విషాదమును భరించవల్సి వస్తుంది. చిట్టితండ్రికి ఇంత చిన్నవయస్సులోనే గనుక నేను కాస్తారాలిపోతే......' అని ఎన్నో రకాలుగా వూహించినకొలదీ, ఆమె మనస్సు తేలుకరచినట్లుగా బాధపడుతూండేది.

ఆమె ఊహాలే నిజస్వరూపం దాల్చినాయి. నిమోనియాజ్వరంతో నాలుగురోజులు బాధపడి మీనాక్షి అయిదోరోజున ప్రాణాలు విడిచింది.

౨

కబురు వినంగానే మీనాక్షి అన్నగారు వచ్చాడు. శ్రాద్ధకర్మలు పూర్తి అయిపోగానే, ఆ ఇంటికి తాళంపెట్టి చెయిన్లను తీసుకుని తనవూరు చేరుకున్నాడు.

మేనమామయింట చెయిన్లకు అనుపాజ్ఞలు ఎక్కువయినాయి. చిన్నచిన్న కారణములకు కూడా మేనమామ చెయ్యి చేసుకుంటూ వచ్చాడు. ఇక మేనత్త తిరస్కారమునకు అంతేలేదు. వాడికి కడుపు నిండా తిండికూడా లభించుటలేదు.

ఒకొక్క సాయంకాల సమయాన పాఠశాలనుంచి వచ్చి నాక డాబామీద ఒంటరిగా కూర్చొని 'అమ్మా! ఏమైపోయినావ్! ఎక్కడకు వెళ్లావ్? నన్ను వొదిలి పెట్టి వెళ్లావేం అమ్మా! నన్ను కూడా తీసుకుని వెళ్ళకపోయినావా? ఈ మామయ్యచేత ఇక్కడ దెబ్బలు తినలేను. అత్తయ్యచేత యీతిట్లూ తినలేకుండా వున్నాను. కొద్దిరోజులలో వచ్చి నన్నుకూడా నీదగ్గఱకు తీసుకుని వెళ్ళవమ్మా. ఏం? దేవుడు ఒప్పుకోడూ? అతనికి నన్నుచూస్తే జాలివేయడం లేదంటావా?...... అమ్మా? నాకు ఆకలివేస్తోంది. నాకడుపులో ఓ మంటపుడుతోంది. మధ్యాహ్నం

దేవుడికి నైవేద్యం పెట్టిన అరటిపండు ఏమిచేశావ్? నాకు విసిరిపడేయకూడదూ? లాగులూ, చొక్కాలు చినిగిపోయినాయి. మామయ్యతో చెపితే నీ ముఖానికి అవి చాల్లే అని చీత్కారించుకుంటోన్నాడు......అమ్మా? నువ్వు మామయ్యకు ఓవుత్తరమన్నా రాయి.' ...అమ్మా! ఒక కానీయియ్యవు? ... ఒక్కటి ... ఒక్కటంటే ఒక్కటి...బజార్లోని మిఠాయికొట్టులో చక్కని పంచనార చిలకలు వ్రేలాడగట్టి వున్నాయి...అమ్మా, వాటిని చూస్తుంటే నాకు నోరూరుతోంది. అమ్మా! ఎంతసేపు పిలిచినా పలకవేం? పోనీ తొంగి అయినా నావంక చూడకూడదూ? ......' అని చెయిన్లు, తల్లిని సంబోధించి ఆకాశంవంక చూస్తూ బ్రతిమాలుకుంటూండేవాడు. ఆకాశం అవతల ఇటువంటి గ్రామమే ఒకటివుండనీ, ఆగ్రామంలోనే తనతల్లి వుంటోందనీ, తను బ్రతిమాలుకుంటే ఆకాశంల్లోనుంచి ఒక్క తడవైనా తొంగిచూడక పోతుందా అని వాని అభిప్రాయం. కాని ఏం లాభం? ఆకాశంవంక చూసిచూసి కళ్లు నీరుకారిపోతవిగాని, వాడితల్లి ఒక్కతడవైనా తొంగిచూడదే?

### ౩

భస్మీపటలమైపోయిన తల్లిని సంబోధించి ఇట్లాగే రోజూ ఒక గంటా, రెండుగంటలపాటు ఏమేమో మాట్లాడుకుంటాడు. నాలుగువైపులా చీకట్లుక్రమ్మి దరిదాపుకు వస్తూండగా మేనమామని తల్చుకుని భయపడుతూ గబగబా మెట్లుదిగి వెళ్ళిపోతాడు. ఆరోజున చెయిన్లు ఇంట్లో ఏదో కొంచెం అల్లరిచేసినమాట నిజమే. మేనత్త గోరంతలు కొండంతలుచేసి కోర్టునుంచిరాగానే భర్తతో చెప్పింది. ఆయన గాండ్రు, గాండ్రుమంటూ చెయిన్లను నిలవేశాడు. వాడు గజగజా వణికిపోతోన్నాడు. మేనమామనేత్రములు కక్కుతోన్న నిప్పులసెగని వానిలేతముఖం భరింపలేక పోతోంది. ఆభయంకర నేత్రములను చూడలేక ముఖం ప్రక్కకు తిప్పుకున్నాడు. వాని చంపలపైనా, వీపుపైనా ఆయన హస్తం తీవ్రంగా వాలుతూ ధ్వని చేస్తూనేవుంది. ఓ పదినిముసముల పాటు చెయిన్లు శరీరం అప్పచెప్పి వూరుకున్నాడు. వానిహృదయం మొద్దయిపోయింది. కళ్ళల్లోనుంచి ఒక్క నీటిచుక్కగూడా రాలడం లేదు. ఆయనలోని మూర్ఖత అంతటితో తృప్తిపడిందికాదు. చెయిన్లను గోడకుర్చీ వేయించి, వానిమోకాళ్ళపై ఒక బరువైన ఇనుపదూలముంచి, తను గదిలోకి వెళ్ళి ఏదో పనిచేసుకుంటోన్నాడు.

### ౪

చయిన్లకు తొంటిలో నొప్పి ఎక్కువైంది. ఇక, కాళ్ళలోని నరాలు ఒకటేపీవు పుడుతున్నాయి.........చెయిన్లకు అసమయంలో తల్లి జ్ఞప్తికొచ్చింది.

'అమ్మా......' అని కెవ్వున కేకవేసి అవురుమనడంలో కొంచెం ప్రక్కకు ఒరగటం సంభవించింది. ఆఇనుపదూలం కొంచెం జారింది. సత్తువలేని ఆలేతకాళ్లు ఒణికినై. వెంటనే క్రిందపడిపోయాడు. వాని శరీరముపై ఆఇనుపదూలంపడ్డది.

'అమ్మా!' అని మళ్ళీ కెవ్వున కేక. డొక్కలోనుంచి ఎఱ్ఱగా రక్తం చిమ్ముతోంది. కాళ్లు జుజ్జుజుజ్జు అయిపోయినాయి. కళ్లు మూతలు పడినాయి. ఆకళ్ళ మూతలలో వాడిని, తల్లి చిరునవ్వుతో పిలుస్తోంది. 'నాయనా! చెయిన్లూ! రా!' అని చేతిని ఆడిస్తో.

కనురెప్పలు విడబడినై.. చుట్టూ బోలెడుజనం. ఒక ప్రక్కన డాక్టర్- మరోప్రక్క వాని మేనమామ.

డాక్టర్ చెయిన్ల నేత్రముల్లోకి ఒక నిముసంపాటుచూచి, తదుపరి వాని మేనమామవంక తిరిగి 'హోప్‌లెస్' అన్నాడు.

'అమ్మా!' అని కెవ్వున కేకవేసి మళ్ళీకళ్లుమూశాడు చయిన్లు. ఆ కళ్ళమూతలలో మీనాక్షి చిరునవ్వుతోవచ్చి చెయిన్లను కౌగలించుకుని అన్నది: "నాయనా? నీకు ఇక ఫరవాలేదు. నేను వున్నా."